## క్లుప్తంగా

### బీజేవైఎం ఉపాధ్యక్షుడిగా చింతల రాఘవేందర్

**మీర్‌పేట:** బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా మీర్‌పేటకు చెందిన చింతల రాఘవేందర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదీశ్ శనివారం రాఘవేందర్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, అదే విధంగా బీజేపీ సిద్ధాంతాలను యువతకు వివరిస్తానన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవికి ఎంపిక చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, యాదీశ్, అందెల శ్రీరాములుయాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

### ముఖ్యమంత్రికి జ్ఞాపిక అందజేత



జ్ఞాపిక అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకుడు శ్రీనివాసరావు, తదితరులు

**హుడాకాంప్లెక్స్:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, బ్రాహ్మణ సంఘం నాయకుడు వక్కలంక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంఘం నాయకులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వరూప్‌రాజ్, తులసి శ్రీనివాస్, వారణాసి వంశీ, నందిరాజు లక్ష్మీనారాయణ, మంగపతిరావు, అరుణ, యాదగిరిరావు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

**పహాడీషరీఫ్:** జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జల్‌పల్లిలో జరిగిన సమావేశంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ షేక్ జహంగీరుద్దీన్ ఆధ్వర్యంలో కెంచె శ్రీకాంత్, జె.ఆంజనేయులు, మనోజ్, నర్సింహా, మాణిక్యం, వెంకటేశ్, శ్రీహరి తదితర నాయకులకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా షేక్ జహంగీరుద్దీన్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనను మెచ్చి అన్ని పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించి, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉండేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో జహంగీరుద్దీన్, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మొక్కుబడిగా సమావేశం

**హయత్‌నగర్:** సర్పంచులు లేరు..అధికారులు రారు..సమస్యల ప్రస్తావన తప్ప పరిష్కరించే వారు కరువయ్యారు. శనివారం హయత్‌నగర్‌లో అబ్దుల్లాపూర్‌మెట్టు మండల పరిషత్ సమావేశం ఎంపీపీ బుర్ర రేఖా మహేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అబ్దుల్లాపూర్‌లో సర్వే నెంబర్ 118లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని ఎంపీటీసీ జంగయ్య ఆరోపించారు. రెండేళ్లుగా గ్రామంలో కొంతమందికి కల్యాణలక్ష్మీ పథకం అందడం లేదన్నారు. బస్సుల్లో ఆర్టీసీ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, బస్టాపుల్లో ఆపకుండా ఇబ్బందులు పెడుతున్నారని జెడ్పీటీసీ దేవదాసుగౌడ్ అధికారులపై మండిపడ్డారు. బస్సుల సంఖ్యను పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. రైతులకు హార్టికల్చర్ ద్వారా అమలు చేస్తున్న పథకాలను వివరించాలని, ఆయిల్ పాం తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని ఎంపీటీ చేగూరి వెంకటేశ్ కోరారు.

### గడువులోపు ఫీజు చెల్లించాలి

**ఇబ్రహీంపట్నం రూరల్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాయం డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ –1 సంబంధించిన పరీక్ష ఫీజు మే 6వ తేదీ లోపు చెల్లించాలని కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ప్రభు, అభ్యాసక సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నాగోజీలు తెలిపారు. బీఏ, బీకాం విద్యార్థులు పేపరుకు రూ.150 చొప్పున చెల్లించాలన్నారు. బీఎస్సీ కంప్యూటర్ విద్యార్థులు పేపరుకు రూ.150, ప్రాక్టికల్స్ పరీక్షలకు అదనంగా రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సెమిస్టర్–2 పరీక్షలు మే26 నుంచి జూన్ 1వ తేదీ వరకూ జరుగుతాయన్నారు.

# సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



ఎమ్మెల్యే సబితారెడ్డికి సమస్యలు వివరిస్తున్న చిరు వ్యాపారులు

**ఎమ్మెల్యే సబితా రెడ్డి**

- ట్రాఫిక్ పోలీసులు బెదిరిస్తున్నారు
- ఇష్టంమొచ్చినట్లు చలాన్లు
- ఆదుకోవాలని చిరు వ్యాపారుల మొర

**హుడాకాంప్లెక్స్:** చిరు వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరిస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. కొన్ని రోజులుగా సరూర్‌నగర్ రైతుబజార్ ఎదుట చిరు వ్యాపారులను ట్రాఫిక్ పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇష్టం వచ్చినట్లు చలాన్లు విధిస్తున్నారని వారిగోడును ఎమ్మెల్యేతో విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే దాదాపు 30 ఏళ్లగా మార్కెట్ బయట వ్యాపారం చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అధికారులతో చెప్పారు. ఈ విషయంపై అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఇక్కడ చిరు వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టొదని, వారు రెక్కాడితే గానీ డొక్కాడని పేదలని సూచించారు. ఈ విషయంలో ఎవరికీ ఇబ్బందులు కలగజేయకుండా సజావుగా వ్యాపారాలు చేసుకునేలా ప్రణాళికతో ముందుకు పోవాలని చిరు వ్యాపారులకు సూచించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, ఇంటూరి అంకిరెడ్డి, ఋషిగుప్తా, సుశీల, స్వప్నారెడ్డి తదితరులున్నారు.

**చేవెళ్ల పార్లమెంటులో గెలుపే లక్ష్యం...**

బీఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దిశా నిర్దేశం చేశారు. కొత్తపేటలో శనివారం నిర్వహించిన సరూర్‌నగర్ డివిజన్ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కరెంటు పోతే వార్త కానీ ఇప్పుడు కరెంటు ఉంటే వార్త అని విమర్శించారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అమలుకు సాధ్యం కాని ఆరు హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయంలో ప్రజలను మోసం చేస్తోందని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లెల కృష్ణారెడ్డి, మహేందర్ యాదవ్, కొండల్‌రెడ్డి, మొహమ్మద్ సలీం పాల్గొన్నారు.

# గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం

**మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్**

**మహేశ్వరం:** లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం మహేశ్వరం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కేఎల్లార్ నివాసంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. గత పది సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రం దొరల పాలనలో బందీఅయ్యిందని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం అనే ముసుగులో రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టేశారని దీంతో అది ప్రజలపై భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారన్నారు. మతతత్వ పార్టీలను చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినవారిలో టింగికారి మక్కాజీ, ఏపూరి రాజు, గోల్కొండ సర్వయ్య, కొకుంట్ల శ్రీనివాస్, అల్లె శివరాజ్, బాలేశ్, ఈశ్వర్, లింగం, వెంకటేశ్, ప్రశాంత్ పలువురు చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న మహేశ్వరం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

# కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి**



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

**మహేశ్వరం:** చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల గ్రామంలో మున్సిపాలిటీ ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సమస్యలపై అలుపెరుగని పోరు చేసిన బీసీ నేత కాసానిజ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లాకు జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఈ ప్రాంతానికి ఎంతగానో సేవ చేశారన్నారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని, నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కోరారు. అంతకుముందు తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో ఆమె మాట్లాడి వార్డులు, బూతులలో కారు గుర్తుతో ముమ్మరంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జల్లెల్ల లక్ష్మయ్య యాదవ్, కౌన్సిలర్లు రెడ్డిగళ్ల సుమన్, బి.రవి నాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సప్పిడి రాజు, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, బాట సురేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రత్నం, వీరేశ్‌గౌడ్, నర్సింహ, సురేశ్, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వమే

**మోదీతోనే దేశ రక్షణ**

- కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్యయాదవ్



బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న మర్పల్లి అంజయ్య యాదవ్

**యాచారం:** నరేంద్రమోడీతో దేశ రక్షణ, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వమే వస్తుందని కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో భువనగిరి ఎంపీగా బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కమలంపువ్వు గుర్తుకు ఓటేయాలని కూలీలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం నుంచి మంజూరు చేస్తున్న నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఉపాధి పనులు, సీసీ రోడ్లు, నర్సరీల ఏర్పాటు, మొక్కల పెంపకం తదితర అభివృద్ధి పనులకు మొత్తం కేంద్రమే నిధులు ఇస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పైసా నిధులు కూడా విడుదల కావడం లేదని చెప్పారు. పల్లెల అభివృద్ధికి ప్రతీ యేటా రూ. కోట్లాది నిధులు ఇస్తున్న ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల యాదగిరిరెడ్డి, మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, బూత్ అధ్యక్షుడు గుడాల వెంకటేశ్, శెట్టిపల్లి శివ కుమార్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు గుర్రం శైలజారెడ్డి, మర్పల్లి మల్లేశ్ యాదవ్, మస్కురి శశిధర్, గుడుకుంట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న పట్టగొలుసులు అప్పగింత



పట్టగొలుసులను మహిళకు అప్పగిస్తున్న అజీజ్ తదితరులు

**కందుకూరు:** రోడ్డుపై దొరికిన వెండి పట్టగొలుసులను పోలీసులు బాధితురాలికి అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి... కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన రాణి శనివారం కందుకూరు మండల కేంద్రానికి వచ్చింది. ఆ సమయంలో కందుకూరు గ్రామం వైపు వేళ్లే దారిలో ఆమె కవర్‌లో నుంచి 30 తులాల వెండి గొలుసులు పోగొట్టుకుంది. ఆ గొలుసులు ఉన్న కవర్‌ను కాంగ్రెస్ నాయకుడు, స్థానికంగా టైలర్ షాపు నిర్వహిస్తున్న సయ్యద్ అజీజ్‌కు దొరికొంది. దీంతో ఆయన ఆ కవర్‌ను తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌ఐ శ్రావణ్ గొలుసులు పోగొట్టుకున్న రాణిని గుర్తించి ఆమెకి అప్పగించారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ నాయకుడు కంద పెద నర్సింహా ఉన్నారు. ఈ సందర్భంగా అజీజ్‌ను ఎస్‌ఐ అభినందించారు.

# ఫస్ట్ వైస్ గవర్నర్‌గా మహేంద్రకుమార్‌రెడ్డి



డాక్టర్ జి మహేంద్రకుమార్‌రెడ్డి

**కందుకూరు:** కందుకూరు లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, స్థానిక భూలక్ష్మీ మెమోరియల్ ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ జి మహేంద్రకుమార్‌రెడ్డి లయన్స్ 320ఏ జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ జిల్లా 320ఏ 8వ వార్షిక సమావేశంలో ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్లు మదన్‌గోపాల్, జి.బాబురావు, పీఐడీఆర్ సునీల్‌కుమార్, ఏరియా లీడర్ ఎస్.నరేందర్‌రెడ్డి, దీపక్ భట్టాచార్య, కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు తదితరుల సమక్షంలో నియమించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేంద్ర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 84 క్లబ్బులు, మూడువేల పైచిలుకు సభ్యులున్న లయన్స్‌క్లబ్‌కు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. సమాజంలో స్వచ్ఛంద సంస్థలు చేయవలసిన పనులు ఇప్పటికి చాలా ఉన్నాయని, వీలైనంత ఎక్కువ మందికి సేవలు అందించడం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి, కందుకూరు క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య, బీఆర్ రాంరెడ్డి, జి.దీపారెడ్డి, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లుగుప్తా, కోశాధికారి రామన్‌బాబు, పీఎసీఎస్ డైరెక్టర్ తీగల జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

**కడ్తాల్:** నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని జెడ్పీటీసీ ఖర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి శనివారం మండల కేంద్రం నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పలు వాహనాలలో తరలివెళ్లారు. అంతకు ముందు మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో దశరత్‌నాయక్ మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం గడిచిన పది సంవత్సరాల్లో అభివృద్ధికి మారుపేరుగా నిలిచిందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చలేదన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, గౌరవాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, గోపాల్, రమేశ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

### అకాల వర్షం.. విద్యుత్ సరఫరాలో అంతరాయం

**తుర్కయంజాల్:** నిన్నా..మొన్నటి దాకా ఎండలతో సతమతమవుతున్న జనానికి శనివారం ఉదయం కురిసిన అకాల వర్షం కాస్తా ఉప శమనం కలిగించింది. ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకు ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడ్డది. వర్షం వల్ల ఇండ్లల్లో ఉక్కపోత మాత్రం పెరిగింది. శుక్రవారం సాయంత్రం నుంచి కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో చాలా కాలనీల్లో అంధకారం నెలకొంది. తరుచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. తుర్కయంజాల్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ బస్తీలో 11కేవీ స్తంభం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. నాదర్‌గుల్, గుర్రంగూడలో చెట్లు కూలి విద్యుత్ తీగల మీద పడ్డాయని ఏఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దీంతో ఎవరికీ ప్రమాదం సంభవించలేదన్నారు.

### 'పోలీసులు పట్టించుకోవడం లేదు'

సీఎం ఆఫీసులో బాధితుల ఫిర్యాదు



ఫిర్యాదు చేయడానికి సీఎం ఇంటి వద్దకు వచ్చిన బాధితులు

**బంజారాహిల్స్:** ఫోర్జరీ పత్రాలు సృష్టించి స్థలం కాజేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితులు శనివారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసం వద్ద ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బడంగ్‌పేట మున్సిపాలిటీలోని అల్మాస్‌గూడకు చెందిన చాడ రమేశ్‌చందర్ రెడ్డి వినాయక హిల్స్ కాలనీ సర్వేనంబర్ 94, 95, 96, 97, 103లో దాదాపు నాలుగెకరాల స్థలానికి జీపీఏ హోల్డర్‌గా ఉన్నారు. కాగా ప్లాట్‌నంబర్ 550లోని 300 గజాల స్థలాన్ని మోహన్‌రెడ్డి అనే వ్యక్తికి విక్రయించగా సదరు స్థలంపై కొందరు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఈ సంఘటనపై గత అక్టోబర్‌లో మీర్‌పేట పీఎస్‌తో పాటు వనస్థలిపురం ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. అయితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే సీఎంకు రిజిస్టర్ పోస్టు చేశామని తెలిపారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులకు ఫిర్యాదు అందజేశామని చెప్పారు.



### ఘనంగా బొడ్రాయి వార్షిక ఉత్సవాలు

**ఆమనగల్లు:** ఆకుతోటపల్లి గ్రామంలో బొడ్రాయి వార్షిక ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆకుతోటపల్లి గ్రామంలోని బొడ్రాయిని పూలతో శోభాయమానంగా అలంకరించారు. బొడ్రాయి వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ రజిత, ఎంపీటీసీ నిట్ట మంగమ్మ, పాల్గొన్నారు.

### సీసీ రోడ్ల తనిఖీ

**తలకొండపల్లి:** నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను తనిఖీ నిర్వహించారు. ఎస్ఎస్ఏటీ అధికారి ఎస్ఆర్‌పీ కాశన్న, పీఆర్ఏఈ విద్యాసాగర్‌తో కలిసి సామాజిక తనిఖీ నిర్వహించారు. శనివారం చుక్కాపూర్‌లో–5 రోడ్లు, గట్టుఇప్పలపల్లి–2, బద్నాపూర్‌లో–1 తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా ఇసుక, సిమెంట్, కాంక్రిట్‌లను సమ పాళ్లలో వేశారా? లేదా? అని పరిశీలించారు.

# లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి

**బీజేపీ, బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పండి**

- ఎంపీ అభ్యర్థి మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న మల్లు రవి

**మాడ్గుల:** లోక్‌సభ ఎన్నికల్లో దేశ అభివృద్ధికి పాటుపడుతున్న పార్టీని గెలిపించాలని నాగర్‌కర్నూల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం వాసవి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పాలన్నారు. దేశ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ని గెలిపించాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటు పడే పార్టీ కాంగ్రెసేనని చెప్పారు. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని, తెలంగాణ అప్పుల పాలైందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని, మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడం కోసం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, కోఆర్డినేటర్ ఇందిరా శోభన్, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, యూత్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్, మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, సీనియర్ నాయకుడు రాంరెడ్డి, సంపత్, శేఖర్, శివ, దళపతి, సమీర్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.